క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 28న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. సమ్మయ్యనగర్, కుడా కాలనీ, శంకర్ నగర్, ఆదర్శ నగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. మహంకాళి టెంపుల్, రంగశాయిపేట, కుమ్మరివాడ, ప్రభుత్వ దవాఖాన ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీసీ కెమెరాలతో భద్రత

మామునూరు: సీసీ కెమెరాల ఏర్పాటు భద్రత లభిస్తుందని, ప్రతిఒక్కరూ వ్యక్తిగతంగా తమ ఇల్లు, దుకాణం, వాణిజ్య సముదాయాల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు సూచించారు. ఈ మేరకు వరంగల్ ఆర్టీఏ జంక్షన్ టీచర్స్ కాలనీలో ఎమ్మెల్యే ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ఏసీపీ వెంకటేష్, ఇన్‌స్పెక్టర్ రమేష్, కార్పొరేటర్ అరుణతో కలిసి ఎమ్మెల్యే నాగరాజు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ సీసీ కెమెరాలతో నేరస్తులను త్వరగా పట్టుకోవచ్చని అన్నారు. కార్యక్రమంలో కర్నె రవీందర్, చింత ప్రకాశ్, ఇనుగాల జోగిరెడ్డి, టీచర్స్ కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎంసీపీఐ(యూ) కార్యవర్గం ఎన్నిక

ఖిలా వరంగల్: ఎంసీపీఐ(యూ) వరంగల్ నగర కార్యదర్శిగా మాలోతు సాగర్, సహాయ కార్యదర్శిగా మంచు జగదీశ్వర్ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ నియామక పత్రాలను ఆదివారం అందజేశారు.

కాంగ్రెస్ నేతలకు సన్మానం



హన్మకొండ: బీసీ సంక్షేమ సంఘం హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తేళ్ల సుగుణతో పాటు పీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ.శ్రీనివాస్‌రావును సన్మానించారు. హనుమకొండ ఇందిరానగర్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ 59వ డివిజన్ ఇన్‌చార్జ్ కేతిడి దీపక్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు రవి కిరణ్, ఓబీసీ సెల్ చైర్మన్ దొంగరి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలి మృతి



సమ్మక్క (ఫైల్)


ఖిలా వరంగల్: వరంగల్ 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ దర్గా ప్రాంతానికి చెందిన శతాధిక వృద్ధురాలు బేతి సమ్మక్క (103) ఆదివారం మృతి చెందారు. ఆమెకు ఐదుగురు కొడుకులు, ముగ్గురు కుమార్తెలు కాగా, 50 మంది మనవళ్లు, మనవరాళ్లతో సంపూర్ణ జీవనాన్ని కొనసాగించిన సమ్మక్క.. ఇటీవల అనారోగ్యం పాలై ఆదివారం ఉదయం కన్నుమూశారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



ఖిలా వరంగల్: కరీమాబాద్ ఉర్సు దర్గాలో మీనేస్తం హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు ఆకులపల్లి యాకోబు ఆధ్వర్యంలో సన్‌లైఫ్ ఆస్పత్రి డాక్టర్ అనంతుల అన్వేష్, సూర్య పిల్లల క్రిటికల్ కేర్ ఆస్పత్రి డాక్టర్ జడల హరీష్‌వర్ధన్ నేతృత్వంలో ఉర్సు దర్గా పీఠాధిపతి హజ్రత్ ఉబేద్ బాబా సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానికుల నుంచి అపూర్వ స్పందన వచ్చిందని ఉబేద్‌బాబా తెలిపారు.

ఎఫ్‌పీఓలో సభ్యత్వం ఉండాలి



హసన్‌పర్తి: ప్రతీరైతు ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంఘం)లో సభ్యత్వం పొందాలని పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్‌గౌడ్ సూచించారు. హసన్‌పర్తి మండలం వంగపహాడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని బైరాన్‌పల్లిలో రైతు ఉత్పత్తిదారుల సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ఉత్పత్తులను సమష్టిగా విక్రయించడం ద్వారా కొనుగోలుదారులు, ప్రభుత్వ సంస్థల ద్వారా మెరుగైన ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ జనార్దన్ రెడ్డి, సీఈఓ పరమేష్, ముల్కలపల్లి మహేష్, గండు రమేష్, సిలివేరు స్వామి, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం

- కాజీపేటలో గ్రంథాలయ భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పాఠకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



అద్దెభవనంలో కొనసాగుతున్న గ్రంథాలయం



కాజీపేటలో లైబ్రరీ ప్రతిపాదిత స్థలం

కాజీపేట: కాజీపేట పట్టణంలో గ్రంథాలయ భవన నిర్మాణ పనుల ప్రతిపాదనలు కాగితాలకే పరిమితం కావడంతో పాఠకులు నిత్యం పడుతున్న బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. గ్రంథాలయ ఉద్యమ స్ఫూర్తితో మూడు దశాబ్దాల క్రితం కాజీపేటలో ఏర్పాటైన గ్రంథాలయం నేటికీ అద్దె భవనంలోనే కొనసాగుతోంది. సరైన స్థలం లేకపోవడంతో సర్కిల్ కార్యాలయ ఆవరణలోని రెండు షాపింగ్ కాంప్లెక్స్ గదులను అద్దెకు తీసుకొని అతి కష్టం మీద కార్యకలాపాలను సాగిస్తున్నారు. జిల్లా గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలకు సమానంగా విలువైన అనేక గ్రంథాలు ఉన్నప్పటికీ సరైన వసతి సౌకర్యం కొరవడిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సొంత భవనం నిర్మించడానికి చర్యలు చేపట్టాలంటూ పాఠకులు చేసిన పలు విన్నపాలకు స్థల సేకరణకు గతంలో అధికారులు ఆదేశాలు జారీ చేసినా ఫలితం లేదు.

అన్ని ఉన్నా సౌకర్యాలు సున్నా..

విలువైన ఫర్నిచర్, విలువైన గ్రంథాలు, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలు అనేకం ఉన్నా గదులు సరిపోక వాటిని ఎక్కడ పెట్టాలో తెలియక నిర్వాహకులు అవస్థలు పడుతున్నారు. నిత్యం వంద మందికిపైగా గ్రంథాలయానికి వివిధ అవసరాల నిమిత్తం పాఠకులు వచ్చిపోతుంటారు. అయితే, పట్టుమని పదిమంది పాఠకులు కూడా కూర్చునే స్థలం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిలబడే పత్రికలు, పుస్తకాలు చూసి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

ప్రత్యామ్నాయంపై దృష్టి..

కాజీపేట చౌరస్తాకు కూతవేటు దూరంలో కూలిపోయి శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన పాత మున్సిపల్ భవనం స్థలాన్ని గ్రంథాలయ నూతన భవన నిర్మాణానికి కేటాయించాలనే ప్రతిపాదనలు అటకెక్కాయి. కాజీపేటలో గ్రంథాలయ భవన నిర్మాణానికి ప్రభుత్వం స్థలం కేటాయిస్తే రూ.50 లక్షలను తక్షణమే మంజూరు చేసి సకల సౌకర్యాలతో నూతన భవనం కట్టిస్తానంటూ గత గ్రంథాలయ చైర్మన్ హామీ ఇచ్చారు. మూడేళ్ల క్రితం ఇంజనీరింగ్ అధికారులు ఫైల్ సిద్ధం చేసి మున్సిపల్ కమిషనర్ నుంచి కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పంపినా అనుమతులు రాకపోవడంతో రూ.50 లక్షలు వృథాగా మిగిలిపోయాయి. కనీసం ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా అధికారులు ఆ ఫైల్ దుమ్ముదులిపి స్థలం కేటాయించాలని కాజీపేట పట్టణ వాసులు కోరుతున్నారు.

ఇరుకు గదులతో నిత్యం బాధలే..



అనేక విలువైన పుస్తక సంపద అందుబాటులో ఉన్నా వినియోగించుకునే పరిస్థితులు లేకుండా పోయాయి. రెండు గదుల్లో ఒకటి పత్రిక పఠనానికి, రెండోది పుస్తకాలను నిల్వ చేయడానికే ఉపయోగిస్తున్నారు. దాంతో పాఠకులు పడుతున్న బాధలు అధికారులకు, నాయకులకు పట్టడం లేదు. స్థలం కేటాయించేలా కృషిచేయాలి.

– గౌని ఫణీంధర్ గౌడ్, కాజీపేట

లైబ్రరీకి స్థలం కేటాయించాలి



అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాజీపేట చౌరస్తా సమీపంలో ఉన్న పాత మున్సిపల్ భవన స్థలాన్ని గ్రంథాలయ శాఖకు కేటాయించేలా చర్యలు చేపట్టాలి. ఈ స్థలంలో శాశ్వత భవనం నిర్మిస్తే పాఠకులకు సౌకర్యవంతంగా ఉంటుంది. మంజూరు చేసిన నిధులతో చక్కటి భవనాన్ని నిర్మించవచ్చు.

– ఎస్‌కే.మహమూద్, కాజీపేట

అందని గ్రంథాలయ సేవలు

మడికొండలో శిథిలావస్థకు చేరిన భవనం





గ్రంథాలయ భవనం, కూలిన గోడ

మడికొండ: గత రెండేళ్లుగా మడికొండలోని గ్రంథాలయం తెరుచుకోవడం లేదు. మూడు దశాబ్దాల క్రితం ప్రారంభించిన గ్రంథాలయం గతంలో పాఠకులతో కళకళలాడేది. నేడు దాన్ని పట్టించుకునే వారు లేకపోవడంతో వెలవెలబోతోంది. గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. భవనం గోడలు సైతం కూలిపోయి ప్రమాదకరంగా మారింది. విద్యుత్ సరఫరా లేదు. వర్షం వస్తే భవనం మొత్తం కురుస్తోంది. గతంలో ఇక్కడ పనిచేసిన లైబ్రేరియన్‌ను మరోచోటుకు బదిలీ చేశారు. మరో లైబ్రేరియన్‌ను కేటాయించకపోవడంతో గ్రంథాలయం మూతపడింది. ఇన్‌చార్జ్ ఉన్నాకూడా లైబ్రరీని తెరవడం లేదని స్థానికులు చెబుతున్నారు. గ్రంథాలయానికి కొత్త భవనం నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.

కొత్త భవనం నిర్మించాలి



మూడు దశాబ్దాల క్రితం నెలకొల్పిన గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరింది. ఇప్పుడది ఉపయోగంలో లేదు. దాంతో పాఠకులు, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొత్త భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టి సారించాలి. – దువ్వ వినయ్, స్థానికుడు

పోచమ్మ తల్లికి బోనాలు

- భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన మహిళలు



పొటేళ్లు, బోనాలతో బయలుదేరిన స్థానికులు

మామునూరు: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట గ్రామంలో పోచమ్మ దేవాలయంలో ఆదివారం సాయంత్రం కాంగ్రెస్ నేత గన్నోజు శ్రీనివాసాచారి ఆధ్వర్యంలో పోచమ్మతల్లి బోనాల పండుగను వైభవంగా జరుపుకున్నారు. మహిళలు బోనాలతో ఆలయానికి చేరుకుని పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించారు. అనంతరం భక్తులు అమ్మవారికి కల్లు ఆరబోసి మేకలు, కోళ్లను బలిచ్చారు.

పగలు కూడా వెలుగులే!



హసన్‌పర్తి: నగరంలోని ఒకటో డివిజన్ ముచ్చర్లలో వీధి దీపాలు రాత్రింబవళ్లు వెలుగుతూ ఉన్నాయి. వారం రోజులుగా ఇదే దుస్థితి నెలకొందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

హసన్‌పర్తి: 66వ డివిజన్‌లోని కాకతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు హామీ ఇచ్చారు. కాతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్ కుడా లేఅవుట్ కాలనీలను ఎమ్మెల్యే ఆదివారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని, వీధి దీపాలు వెలగడం లేదని ఎమ్మెల్యే దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. పలు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ లీగల్ వైస్ చైర్మన్ నిమ్మా శేఖర్‌రావు, డివిజన్ అధ్యక్షుడు కనపర్తి కిరణ్, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, ఎస్ఎస్‌యూఐ జిల్లా మాజీ అధ్యక్షుడు వీసం సురేందర్ రెడ్డి, దేవస్థాన చైర్మన్ ఆరెల్లి వెంకటస్వామి, మాజీ ఉపసర్పంచ్ బల్సుకూరి శ్రీనివాస్, మాజీ వార్డు సభ్యుడు పోతరాజు ప్రభాకర్, దేవస్థాన ధర్మకర్త సురేష్, నాయకులు పెద్దమ్మ నర్సింహారాములు, తాళ్ల మధు, కాకతీయ వెంటేజ్, బీకేఆర్ ఎన్‌క్లేవ్‌ల అధ్యక్షులు, తదితరులు పాల్గొన్నారు.

రజకుల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం



భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యులను సన్మానిస్తున్న రజక సంఘం సభ్యులు

- రజక సంఘం ప్రధాన కార్యదర్శి భిక్షపతి

హసన్‌పర్తి: రజకుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేస్తానని రజక సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిట్యాల భిక్షపతి అన్నారు. భద్రకాళి దేవస్థానం పాలక మండలి సభ్యులుగా నియమితులైన పాలడుగుల ఆంజనేయులు, ఓరుగంటి పూర్ణచందర్‌తో పాటు రజక సంఘం రిటైర్డ్ ఉద్యోగులు కుమారస్వామి, సారయ్య, సుధాకర్‌ను హసన్‌పర్తి ఆదర్శ రజక సహకార సంఘం ఆధ్వర్యంలో ఎర్రగట్టు దేవస్థాన కల్యాణ మండపంలో ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో రజకులు పోటీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆదర్శ రజక సహకార సంఘం అధ్యక్షుడు గోపరాజు ఉదయ్‌కుమార్, సభ్యులు కుమారస్వామి, ఎల్కరాజు సదానందం, సాంబమూర్తి, గుడికందుల సురేష్, గోపరాజు యాదగిరి, గుడికందుల కనకస్వామి తదితరులు పాల్గొన్నారు.

రుద్రమ విగ్రహాన్ని కవిత తాకడం సిగ్గుచేటు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న రవికుమార్

రామన్నపేట: లిక్కర్‌స్కామ్‌లో కూరుకుపోయిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. తెలంగాణ వీరనారి రాణి రుద్రమదేవి విగ్రహానికి పూలమాల వేయడం తెలంగాణ సమాజానికే అవమానకరమని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ధ్వజమెత్తారు. ఈ మేరకు పోచమ్మమైదాన్‌లోని రాణి రుద్రమదేవి విగ్రహానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. వరంగల్ జిల్లా మహిళా మోర్చా, యువజన మోర్చా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రవికుమార్ పాల్గొని మాట్లాడుతూ ప్రజల కోసం యుద్ధ రంగంలో కదం తొక్కి పోరాడిన రుద్రమదేవి విగ్రహాన్ని లిక్కర్ వ్యాపారం చేస్తూ రూ.కోట్లు గడించిన కవిత పూలమాల వేయడం అపచారమని ఆరోపించారు. లిక్కర్ స్కామ్‌లో జైలుకు సైతం వెళ్లిన కవిత.. రాణి రుద్రమదేవి విగ్రహం వద్ద ముక్కు నేలకు రాసి క్షమించాలని కోరాలని డిమాండ్ చేశారు. వీరనారి రుద్రమదేవిని అవమానించినందుకే క్షీరాభిషేకం నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, యువజన మోర్చాలతో పాటు బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలి



సమావేశంలో పాల్గొన్న వైశ్య ప్రతినిధులు

కాజీపేట రూరల్: వ్యాపారం ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో ఉండాలని వైశ్య ప్రతినిధులు అన్నారు. వరంగల్ నగరంలోని స్టేషన్ రోడ్డులోని గ్రాండ్ గాయత్రి హోటల్లో వైశ్య బిజినెస్ లీడర్స్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జీవీబీఎల్ వ్యవస్థాపక చైర్మన్ మంచి రాజశేఖర్ మాట్లాడుతూ వ్యాపారంలో సేవతో పాటు ఇచ్చిపుచ్చుకునే ధోరణి ఉండాలని అన్నారు. సంప్రదాయ వ్యాపారాలను కొత్తపుంతలు తొక్కించాలని సూచించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వరంగల్ చాప్టర్ చైర్మన్‌గా ఓలాం ప్రభుకిరణ్, వైస్ చైర్మన్ (ఆపరేషన్స్) బొడ్ల రవీంద్రనాథ్, వైస్ చైర్మన్ గొరిశెట్టి ప్రభాకర్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

కమలాపూర్ : భూ భారతిలో స్వీకరించిన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించి భూ భారతి దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలించారు. భూ భారతి దరఖాస్తుల ఆన్‌లైన్ పూర్తికాగానే సంబంధిత రైతులకు నోటీసులు జారీ చేసి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం స్థానిక ఆస్పత్రిని సందర్శించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను వెంకట్‌రెడ్డి ఆదేశించారు.

ఢిల్లీకి తరలిన పోస్టల్ పెన్షనర్స్ సంఘం నాయకులు



ఢిల్లీకి బయలుదేరుతున్న సంఘం నాయకులు

కాజీపేట రూరల్: తమ సమస్యల పరిష్కారానికి భారతీయ పోస్టల్ పెన్షనర్స్ సంఘ్, పోస్టల్ అండ్ ఆర్ఎంఎస్ పెన్షనర్స్ సంఘం నాయకులు కాజీపేట జంక్షన్ నుంచి తెలంగాణ ఎక్స్‌ప్రెస్‌లో ఢిల్లీకి ఆదివారం తరలివెళ్లారు. సీజీహెచ్ఎస్ స్కీంలో పేర్కొన్న పెన్షనర్స్ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటుపై కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి, అధికారులను కలిసి వినతి పత్రం ఇవ్వనున్నట్లు వారు తెలిపారు. 8వ పే కమిషన్‌లో గ్రామీణ తపాలా ఉద్యోగులను చేర్చాలని, కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సులను వెంటనే అమలు చేయాలని సంబంధిత అధికారులకు విజ్ఞప్తి చేయనున్నట్లు పేర్కొన్నారు. ఢిల్లీకి తరలివెళ్లిన వారిలో గ్రామీణ తపాలా ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, కేంద్ర ప్రభుత్వ పెన్షనర్స్ సంఘం నాయకులు ఎస్.సదానందం, చాడా జైహింద్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కక్కెర్ల సాంబయ్య, లింగారెడ్డి, తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



మాట్లాడుతున్న కుమారస్వామి

హన్మకొండ చౌరస్తా: దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి పార్లమెంట్‌లో కేంద్రం ఆమోదించాలని దళిత నిరుద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్‌లో సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెండో రాజధానిగా పేర్కొంటున్న వరంగల్‌ను ఆరు జిల్లాలుగా విభజించి గత పాలకులు అభివృద్ధిని అడ్డుకున్నారని ఎద్దేవాచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి హనుమకొండ, వరంగల్‌ను ఒకే జిల్లాగా ప్రకటించాలని కోరారు. మామునూరు విమానాశ్రయానికి రూ.205 కోట్లు కేటాయించిన సీఎం రేవంత్‌రెడ్డి చొరవ చూపి డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ ఎయిర్‌పోర్టుగా నామకరణం చేయాలని సూచించారు. సమావేశంలో కంజర్ల సమ్మయ్య, మహేందర్, జన్ను శివరాజ్, చల్ల మిథున్, బాసి మనోహర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై ట్రాఫిక్ జామ్

దామెర: హైదరాబాద్ – భూపాలపట్నం 163 నంబర్ జాతీయ రహదారిపై ఆదివారం భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. మండలంలోని ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారిలోపై ఎస్సారెస్పీ కెనాల్‌పై బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయి. రాకపోకలు కొనసాగించేందుకు బ్రిడ్జిపై తాత్కాలిక దారి నిర్మించారు. అయితే, డైవర్షన్ రోడ్డుపై లారీ బ్రేక్‌డౌన్ అవడంతో కిలో మీటర్‌మేర వాహనాలు సుమారుగా గంటకుపైగా నిలిచిపోయాయి.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మామునూరు: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. హసన్‌పర్తి మండలం నాగారం గ్రామానికి చెందిన తోట రాజు(36) కంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఖిలా వరంగల్ మండలం నక్కలపల్లిలోని ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన ఓ వ్యక్తికి డ్రెస్సింగ్ చేసేందుకు శనివారం సాయంత్రం బైక్‌పై తోట రాజు వెళ్తుండగా చెన్నారావుపేటకు చెందిన ఓ వ్యక్తి కారు.. బైక్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. దాంతో రాజు తలకు బలమైన గాయాలుకాగా, క్షతగాత్రుడిని కారు డ్రైవర్ అదే కారులో ఎంజీఎం ఆస్పత్రికి, అక్కడి నుంచి ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అక్కడి వైద్యుల సూచన మేరకు శనివారం రాత్రి హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మృతుడి తండ్రి తోట రాజయ్య ఫిర్యాదు మేరకు కారు డ్రైవర్‌పై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు మామునూరు ఎస్సై కృష్ణవేణి తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి సీపీఐ కృషి

- పార్టీ జిల్లా కార్యదర్శి మేకల రవి



సమావేశంలో మాట్లాడుతున్న మేకల రవి

ఖిలా వరంగల్: పేదలు, కార్మికుల సంక్షేమాభివృద్ధికి సీపీఐ ఎనలేని కృషి చేస్తోందని పార్టీ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్‌మియా అన్నారు. వరంగల్ శివనగర్‌లోని గణేష్ రాజ్ అధ్యక్షతన ఎల్‌బీఆర్‌నగర్ శాఖ ఆరో మహాసభ ఆదివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా వారు మాట్లాడుతూ బూర్జువా పార్టీలతో అభివృద్ధి ఏమాత్రం జరగదని ఆరోపించారు. అనంతరం ఎల్‌బీఆర్ నగర్ శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. శాఖ కార్యదర్శిగా చెలుకల రాజు, సహాయ కార్యదర్శి ఏనుగు శైలజ, రాజేశ్వరమ్మ, కమిటీ సభ్యులుగా గణేష్‌రాజ్, ఎడ్ల అనసూర్య, కల్పన, ఏసుబాబు, శ్రీను, గంగయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యాకాంబ్రచారి, బద్రి, జన్ను రవి, కుమార్, సదానందం, పద్మ, లక్ష్మి, సాజిదా, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగించారు

సీపీఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ప్రభాకర్ రెడ్డి

హసన్‌పర్తి: దేశాన్ని కార్పొరేట్ సంస్థలకు మోదీ సర్కారు అప్పగించిందని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి ధ్వజమెత్తారు. హసన్‌పర్తి మండల కేంద్రంలో సీపీఎం కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీ ప్రసంగాల్లో హడావుడే తప్ప కార్యాచరణలో శూన్యమని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలు గాలి మాటలయ్యాయని విమర్శించారు. తన మాటతోనే ప్రజలను మత్తులో దింపుతున్నారని పేర్కొన్నారు. ఇంధన ధరలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నాయకుడు సతీష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి గుమ్మడి రాములు, నాయకులు పుల్లా అశోక్, రజిత, సుచేందర్, సుమన్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు



సెంటర్ వద్ద రోటరీ క్లబ్ సభ్యులు, రైల్వే అధికారులు

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్‌లో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ సెంటర్‌ను పిల్లల తల్లులు సద్వినియోగం చేసుకోవాలని రోటరీ క్లబ్ హనుమకొండ జిల్లా 3150 పూర్వ గవర్నర్ డాక్టర్ శరత్‌బాబు సూచించారు. కాజీపేట జంక్షన్‌లోని వెయింట్ హాల్‌లో ఏర్పాటు చేసిన బేబీ ఫీడింగ్ సెంటర్‌ను ఆయన ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. మాతృ, శిశు ఆరోగ్యంపై ప్రత్యేక చొరవతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కాజీపేట చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ అరుణ్‌శౌరి, రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, క్లబ్ ప్రెసిడెంట్ బేతి రవీందర్‌రెడ్డి, సెక్రటరీ గంగోజుల నరేష్, ట్రెజరర్ రాజ్‌కుమార్ మిరియాల, సభ్యులు రవీంద్రనాథ్, మంజుల, తిరుమల, దారం శ్రీనివాస్, సమీర్, సందసాని నరేష్, రాజిరెడ్డి పాల్గొన్నారు.

మత్తడి పడుతున్న పరికికుంట



నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాజీపేట మండలం మడికొండలోని పరికికుంట మత్తడి పడుతోంది. దాంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాలు సైతం పెరిగి పంటలు పండుతాయని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కాగా, మత్తడిని చూసేందుకు స్థానికులు తరలివచ్చి సెల్ఫీలు దిగుతున్నారు.

– మడికొండ